# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



కోట్‌పల్లిలో రోడ్డు భద్రతా మాసోత్సవాలపై ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

బంట్వారం, జనవరి 17 : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సీఐ రఘురాములు సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ బాధ్యత అందరిపై ఉందన్నారు. రహదారిపై వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం చట్టరీత్యా నేరమన్నారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. యువత ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారని, రాంగ్ సైడ్ డ్రైవింగ్‌తో ఎక్కువగా ప్రమాదాలు జరిగాయని తెలిపారు. బైక్ నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై గఫర్, యువకులు, రాజకీయ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# శిశు గృహకు బాలిక అప్పగింత



వికారాబాద్ శిశు గృహలో అప్పగించిన బాలికతో రిజ్వాన, అంగన్‌వాడీ టీచర్లు

మర్పల్లి, జనవరి 17 : అమ్మకానికి పెట్టిన బాలికను వికారాబాద్ శిశు గృహకు తరలించిన ఘటన మండల పరిధిలోని ఘనాపూర్‌లో శుక్రవారం జరిగింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రిజ్వాన తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన జాని యాదమ్మ కూతురు సౌందర్య మతిస్థిమితం లేక ఎక్కడికో వెళ్లిపోయింది. సౌందర్యకు సరస్వతి (7) కూతురు ఒకటో తరగతి చదువుతున్నది. ఆ బాలిక అమ్మమ్మ యాదమ్మ దగ్గర ఉంటుంది. శుక్రవారం సరస్వతిని యాదమ్మ విక్రయిస్తున్నట్లు 100 నంబర్‌కు ఫోన్ కాల్ వచ్చింది. స్పందించిన మర్పల్లి పోలీసులు సీడీపీవో ప్రవీణకు సమాచారం అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రిజ్వాన ఘనాపూర్, పట్లూర్ అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, పుష్పతో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి పాపను మర్పల్లి పీఎస్‌కు తరలించారు. అక్కడి నుంచి వికారాబాద్‌లోని శిశు గృహలో బాలికను అప్పగించినట్లు ఆమె తెలిపారు.


# మంబాపూర్‌లో ఆలయాల చైర్మన్ల ఎన్నిక



నూతనంగా ఎన్నికైన ఆలయాల కమిటీ చైర్మన్లు, సభ్యులు

పెద్దేముల్, జనవరి 17 : పెద్దేముల్ మండల పరిధిలోని మంబాపూర్‌లో గోపాలకృష్ణ, హనుమాన్ ఆలయాలకు గ్రామస్తులంతా కలిసి నూతన చైర్మన్లు, పాలక మండళ్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గోపాలకృష్ణ ఆలయ చైర్మన్‌గా ముద్దిని రాములును, నూతన పాలక మండలి సభ్యులుగా రేగొండి నర్సింహులు, సి.నారాయణ రెడ్డి, లక్ష్మిని ఎన్నుకున్నారు. హనుమాన్ ఆలయ చైర్మన్‌గా వరప్రసాద్ గౌడ్, నూతన పాలక మండలి సభ్యులుగా రాజావర్ధన్ రెడ్డి, రాములు, విజయ్ కుమార్, అనితను ఎన్నుకున్నారు. అనంతరం దేవాదాయ శాఖ అధికారి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నూతన చైర్మన్లు, సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల భజన మండలి భక్తులు, నాయకులు, మంబాపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# సీపీఎం నాయకుడు వెంకటయ్యను బైండోవర్ చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

పరిగి, జనవరి 17 : సీపీఎం పార్టీ నాయకుడు ఎం.వెంకటయ్యను వెంటనే బైండోవర్ చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి గీత పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని మొట్టకోడూరులో సర్వే నంబర్ 25, 26లో ఉన్న ప్రభుత్వ సీలింగ్ భూమిలో సాగు చేసుకుంటున్న పేదల భూమిని లాక్కోవాలని కుట్ర చేశారన్నారు. గతేడాది జూలైలో భూమి సాగు చేసుకుంటున్న పేద రైతులను భూమి నుంచి ఖాళీ చేయాలని అధికారులతో ఒత్తిడి చేసిన వారితో వెంకటయ్య ఉన్నారని తెలిపారు. ఈ విషయంలో కొందరిపై కేసు నమోదు చేశారు. వారిలో సీపీఎం నాయకుడు వెంకటయ్యపై కేసు నమోదు అయింది. ఈ కేసులో రైతులను మాత్రమే బైండోవర్ చేశారని తెలిపారు. వెంకటయ్యను వెంటనే బైండోవర్ చేయాలని, పేదల భూములకు పట్టాలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకుడు బి.మల్లేశ్, వెంకటయ్య, రాంచంద్రయ్య, యాదయ్య, మల్లేశ్, జంగయ్య, తదతరులు ఉన్నారు.

# గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలు



మున్నూరు సోమారంలో పశువులకు చికిత్స చేస్తున్న వైద్యాధికారులు

ధారూరు, జనవరి 17 : మండల పరిధిలోని మున్నూరు సోమారం, ఎబ్బనూరు గ్రామాల్లో శుక్రవారం కేరెళ్లి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాలను నిర్వహించారు. మున్నూరు సోమారంలో 799 పశువులు, ఎబ్బనూరులో 415 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించామని వైద్యాధికారులు తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ధారూరు పశు వైద్యాధికారి శ్వేత, నాగసముందర్ పశు వైద్యాధికారి బాబ్జి, సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ సింగ్ ఠాగూర్, విశ్రాంత పశు వైద్యులు పున్నయ్య, సేవా సమితి సభ్యులు రామకృష్ణారెడ్డి, బాలరాజు, గోవిందరావు, వెంకట్ రెడ్డి, నర్సింహులు, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సర్వేను వెంటనే పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

వికారాబాద్, జనవరి 17 : నాలుగు ప్రతిష్టాత్మక పథకాల అమలు కోసం క్షేత్ర స్థాయిలో చేస్తున్న సర్వేను వెంటనే పూర్తి చేయాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం నుంచి తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులు, ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన ఆహార భద్రతా కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు లబ్ధిదారుల ఎంపిక పథకాల అమలు కోసం నిర్వహిస్తున్న సర్వేను రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ప్రతి నిరుపేదకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే దిశగా జిల్లా యంత్రాంగం పని చేయాలన్నారు. లబ్ధిదారుల ముసాయిదా జాబితా తయారీకి నిరుపేదల గుర్తింపునకు సర్వే ప్రక్రియ పారదర్శకంగా ఉండాలన్నారు. రైతు భరోసాకు సాగులో ఉన్న భూముల వివరాలు, వ్యవసాయానికి అనువుగా లేని భూములు, రియల్ ఎస్టేట్ భూములు, మైనింగ్ చేస్తున్న భూములు, ప్రభుత్వం ప్రాజెక్టుల కోసం తీసుకున్న భూములు తదితర వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. ఫామ్ ప్లాట్స్, ఫామ్ హౌస్‌లను గుర్తించి సర్టిఫికెట్ ఇవ్వాలని, సర్వేలో ఏమైనా సమస్య వస్తుందా.. వస్తే కారణాలను రాయాలని సూచించారు. ఈ నెల 20 వరకు సర్వేను పూర్తి చేయాలన్నారు. 21 నుంచి 24 వరకు గ్రామసభలు, వార్డు సభలు నిర్వహించి అర్హుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. నిర్ధేశించిన షెడ్యూల్ ప్రకారం సర్వే, గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. అయోమయానికి గురికాకుండా తప్పులకు ఆస్కారం ఇవ్వకుండా పారదర్శకంగా.. అత్యంత జాగ్రత్తగా నిర్దేశిత గడువు లోగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీవో శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి, డీపీవో జయసుధ, డీఎస్‌వో మోహన్ బాబు , తహసీల్దార్లు మండల అభివృద్ధి అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు

- తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో మహేశ్‌బాబు
- గ్రామాల్లో కొనసాగుతున్న సర్వే
- పరిశీలిస్తున్న అధికారులు



దోమ : బొంపల్లిలో కొత్త రేషన్ కార్డుదారుల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

దోమ, జనవరి 17 : అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో మహేశ్‌బాబు అన్నారు. మండల పరిధిలోని బొంపల్లిలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను శుక్రవారం ఇంటింటికీ తిరిగి సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో దరఖాస్తుదారులు అందుబాటులో ఉండి సర్వేకు వచ్చిన అధికారులకు సహకరించి పూర్తి వివరాలు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో సోమలింగం, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



బంట్వారం : తొరుమామిడిలో రేషన్ కార్డుల సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

**దదఖాస్తుదారులు సహకరించాలి**

**బంట్వారం :** గ్రామాల్లోకి రేషన్ కార్డుల పరిశీలనకు వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని తొరుమామిడిలో నిర్వహిస్తున్న రేషన్ కార్డుల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా పాలనలో ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారు వివరాలు ఇవ్వాలన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

# వైభవం.. బోనాల ఉత్సవం



బూచన్‌పల్లిలో రక్తమైసమ్మ తల్లి ఆలయానికి బోనాలతో వెళ్తున్న మహిళలు

మర్పల్లి, జనవరి 17 : మండల పరిధిలోని బూచన్‌పల్లిలో శుక్రవారం గ్రామ దేవతల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తమైసమ్మ ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. మహిళలు బోనం కుండలను అందంగా అలంకరించుకుని ర్యాలీగా అమ్మవారి ఆలయానికి వెళ్లి నైవేద్యాలను సమర్పించి మొక్కులను సమర్పించుకున్నారు. ఈ వేడుకల్లో పోతురాజుల విన్యాసాలు, మహిళల పూనకాలు, యువతీ యువకుల కేరింతలు, డప్పు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.


# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తరిగోపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ధారూరు, జనవరి 17 : ఆనందం, ఉద్వేగం, ఆప్యాయ పలకరింపులు, చిన్ననాటి జ్ఞాపకాలు, చిలిపి ముచ్చట్లు అక్కడంతా ఉద్విగ్న వాతావరణం నెలకొంది. శుక్రవారం ధారూరు మండల పరిధిలోని తరిగోపులలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అపూర్వ సమ్మేళనం ఇందుకు వేదికైంది. తరిగోపుల జడ్పీ ఉన్నత పాఠశాలలో 2008–09 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులందరూ ఒక చోట చేరారు. 16 ఏండ్ల తర్వాత కలిసిన మిత్రుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నప్పుడు చేసిన అల్లరి, గురువుల బెత్తం దెబ్బలు ఇలా అన్నీ గుర్తు చేసుకున్నారు. అందరూ కలిసి భోజనాలు చేశారు. పాఠశాల విద్య తర్వాత జీవితంలో జరిగిన ఒడిదుడుకులను తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎవరెవరూ ఎక్కడెక్కడ ఏయే పనులు చేస్తున్నారో వివరాలు తెలుసుకున్నారు. అప్పుడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. అందరూ కలిసి ఒక వేదిక మీదికి రావడానికి గతంలోనే ఒక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసుకున్నారు. తరచూ కలుసుకునేలా చూడాలని పలువురు పూర్వ విద్యార్థులు కోరారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే

పెద్దేముల్, జనవరి 17 : స్థానిక రైతు వేదికలో వివిధ గ్రామాలకు చెందిన 119 మంది లబ్ధిదారులకు రూ.1,19,13,804 లు విలువ చేసే చెక్కులను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## నకిలీ ఇన్సూరెన్స్ ముఠా గుట్టురట్టు

శంషాబాద్ రూరల్, జనవరి 17 : నకిలీ ఇన్సూరెన్స్ ముఠానుఎస్‌వోటీ పోలీసులు గుట్టురట్టు చేసిన ఘటన శుక్రవారం శంషాబాద్ ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఆర్జీఐఏ సీఐ బాలరాజు తెలిపిన ప్రకారం.. శంషాబాద్‌లో నకిలీ ఇన్సూరెన్స్ చేయిస్తున్నట్లు ఎస్‌వోటీ పోలీసులకు రిలయన్స్ కంపెనీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు శుక్రవారం శంషాబాద్‌లోని ఆర్బీనగర్ కాలనీకి చెందిన ఆర్టీఏ ఏజెంట్ శ్రావణ్‌గౌడ్, సర్ధార్‌నగర్‌కు చెందిన శివకుమార్‌తోపాటు హైదరాబాద్‌లోని బహదూర్‌పుర ప్రాంతానికి చెందిన షఫీ మరో 15 మంది ఏజెంట్లను నియమించుకొని నకిలీ ఇన్సూరెన్స్ పత్రాలు తయారు చేసి వాహనదారులకు అంటగడుతున్నట్లు గుర్తించి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. 15 మంది పరారీలో ఉన్నట్లు వివరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## అనుమానాస్పదంగా భార్యభర్తలు మృతి



శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

వికారాబాద్, జనవరి 17 : అనుమానాస్పదంగా భార్యభర్తలు మృతి చెందిన ఘటన శుక్రవారం వికారాబాద్ పట్టణంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు... వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్తగడికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి, అఖిల భార్యభర్తలు. శుక్రవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. భార్యభర్తల మృతదేహాలను వికారాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించి మార్చురీలో భద్రపర్చారు. మృత దేహాలను పరిశీలించిన వికారాబాద్ పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. భార్యభర్తల మృతికి కారణాలు తెలియరాలేదు.



రైతు మహాధర్నాకు హాజరైన కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

# రైతు మహాధర్నాకు తరలిన బీఆర్ఎస్ నేతలు

పరిగి, జనవరి 17 : షాబాద్‌లో శుక్రవారం జరిగిన రైతు మహాధర్నాకు పరిగి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ నేతలు తరలివెళ్లారు. పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి నేతృత్వంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, పరిగి, పూడూరు మాజీ ఎంపీపీలు కరణం అరవింద రావు, మల్లేశం, మండల బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దోమ మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం, నాయకులు బి.రవికుమార్, వారాల రవి షాబాద్ ధర్నాకు వెళ్లారు. ఈ సందర్భంగా షాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి స్వాగతం పలికారు.

# దళితులపై దాడులను అరికట్టాలి




సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కేవై రత్నం

తాండూరు, జనవరి 17 : సమాజంలో అక్కడక్కడా దళితులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వాలు పూర్తిగా అరికట్టాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కేవై రత్నం డిమాండ్ చేశారు. శుక్రవారం తాండూరు పట్టణంలోని నంబర్–1 ఉన్నత పాఠశాలలో అసమానతల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో రోహిత్ వేముల సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 2016 జనవరి 17న రోహిత్ వేముల బలవన్మరణం కలిచివేసిందన్నారు. దళిత టీచర్లపై దాడులు జరుగుతున్నాయన్నారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలను తీసుకురావాలని కోరారు. బీజేపీ సర్కార్ నూతన విద్యా విధానం పేరుతో చరిత్రను మంటగలుపుతున్నదన్నారు. కార్యక్రమంలో అసమానతల నిర్మూలన పోరాట సమితి ప్రతినిధులు వెంకటయ్య, బండారి లక్ష్మయ్య, నరేశ్, కృష్ణ, శ్రీను, చక్రవర్తి, మోహన్‌కృష్ణ, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

# షార్ట్ సర్క్యూట్‌తో గేదెల షెడ్డు దగ్ధం



**అగ్నికి అహుతైన రెండు గేదెలు**

పెద్దేముల్, జనవరి 17 : మండల పరిధిలోని జనగాం గ్రామంలో నాగారం రైతు అనంత్ రెడ్డికి చెందిన గేదెల షెడ్డు శుక్రవారం తెల్ల వారుజామున షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. అందులో కట్టేసిన రెండు చిన్న గేదెలు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఒక ఆవు, 5 గేదెలకు మంటలు అంటుకోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి పెద్దేముల్ వెటర్నరీ డాక్టర్ దీప్తి, సిబ్బంది నరేందర్, శ్రీను, శేఖర్‌తో పాటు 1962 సిబ్బంది చేరుకొని చికిత్స చేశారు. ఈ విషయమై రైతు అనంత్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చే శారు. పెద్దేముల్ ఎస్సై శ్రీధర్‌రెడ్డి ఘటనా స్థలానికి వచ్చి పంచనామా చేశారు. రైతు ఇంట విషాదమే మిగిలింది. సుమారు రూ.4 లక్షల వరకు నష్టం వాటిల్లినట్టు రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

Before the Hon'ble Arbitrator / Dy. Registrar of Chits at Mahabubnagar
ARB. Claim No.270 of 2024
Between
SHRIRAM RAGHAVENDRA CHITS BR. Mahabubnagar ... Disputant
And
B.Srinivasulu and others ... Opponents

NOTICE

To
2) Enumula Jangi Reddy, S/o Ramachandra Reddy, aged 44 years, Occ: Real Estate Business, R/o H.No.2-101-18, Gandhamguda Vg.Rajendra nagar Mdl.Ranga Reddy Dist, CellNo. 9246864688.
Opponents No.2

Take notice that the above Arbitration case filed by the Disputant to recover the chits dues under A.P. Chit Fund Act. and Rules of 2008 against you and others. You are avoiding the notice, hence we are publishing notice on you to appear before the Arbitrator H.No. 7-5-108/2/A, back side of Telephone Exchange, Venkateshwara Colony, Mahabubnagar on **25-01-2025** at **11-30A.M.** for your appearance, in person or through an Advocate, in case you failed to appear before this Hon'ble Arbitrator the Claim will be decided ex-parte.
"By the order of the Arbitrator"
Mahabubnagar

**S. MALLA REDDY** Advocate
H.No.8-6-212, Padmavathi Colony
Mahabubnagar . Cell No.9000002415

## బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలి

కులకచర్ల, జనవరి 17 : బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని సీఆర్పీ గంగ్యానాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కామునిపల్లిలో బడిబయట ఉన్న పిల్లల కోసం సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 6నుంచి 15 ఏండ్లలోపు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. గ్రామంలో బోయమోని మహేశ్ అనే విద్యార్థి 9వ తరగతి చదువుతూ మధ్యలో బడి మానివేశాడు. వి ద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడి బడిమా ని వేయడానికి కారణాలను తెలుసుకు ని పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలన్నారు. ఇతర పనులు, కర్మాగారాల్లో పిల్లలను పనికి పంపవద్దని సూచించారు. చదువుతోనే పిల్లలకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

కులకచర్ల, జనవరి 17 : సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలా ఉపయోగపడుతుందని కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం కులకచర్ల మండల పరిధిలోని ము జాహిద్‌పూర్ గ్రామానికి చెందిన ముసలి అనంతయ్యకు రూ.60 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ చంద్రభూపాల్‌రావు, గ్రామ అధ్యక్షుడు షరోద్దీన్, యూత్ అధ్యక్షుడు సోమలింగం, సోషల్ మీడియా కన్వీనర్ భాస్కర్, నాయకులు బాలకిష్టయ్య, రాములు, ఉప్పరి చెన్నయ్య, దాసరి అంజి, పులింగ వెంక టేశ్, కాకి శివ, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ అయిన పొరిమాల్ మైటి తండ్రి సనత్ మైటి, నివాసము: ఇం.నెం.21-2-436/2, షక్కర్ కోఠ, మిట్టికషేర్, చార్మినార్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా మరియు కిషన్‌గూడ గ్రా॥, శంషాబాద్ మం॥, రంగారెడ్డి జిల్లాలో గల ప్లాటు నం.94 Amity Park Sector-III, సర్వే నం. 65/ఇ, 66/ఇ, 67/ఇ, 68/ఇ, విస్తీర్ణం 400 చ.గ॥లు శ్రీమతి బొర్ర సుధారాణి భర్త బొర్ర మహేందర్ గారి నుండి సేల్ డీడ్ నం.8178/2023. ఇట్టి డాక్యుమెంట్‌కు లింక్ అయిన విక్రయ దస్తావేజు రిజిస్టర్డ్ నెం.1481/2003 లభ్యము లేదు. పోగొట్టుక పోయినది అని తెలిపినారు. నా క్లయింట్ అయిన పొరిమాల్ మైటి తండ్రి సనత్ మైటి ఇట్టి ప్లాటును తనఖా చేసి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, షాద్‌నగర్ బ్రాంచి నుండి రుణము తీసుకుంటున్నారు. ఇట్టి దానిపై ఎవరికి ఏ విధమైన ఆక్షేపణలు ఉన్నట్లయితే ఈ ప్రకటన వెలువడిన 15 రోజుల లోపు వారి అభ్యంతరాలను తగిన ఆధారాలను క్రింది అడ్రసుకు సంప్రదించగలరు. లేనిచో షెడ్యూలు ఆస్తి వివాద రహితమైనదిగా భావించగలరు. ఆ తరువాత వచ్చు ఏలాంటి ఆక్షేపణలు అభ్యంతరములు చెల్లనేరవు.
**ఆస్తి వివరాలు :** కిషన్ గూడ గ్రామము, శంషాబాద్ మండలము, రంగారెడ్డి జిల్లాలో గల ప్లాటు నం.94, సర్వే నెం.65/ఇ, 66/ఇ, 67/ఇ & 68/ఇ, విస్తీర్ణం 400 చ.గజములు.
**హద్దులు : ఉత్తరము:** ప్లాట్ నం.79, **దక్షిణము:** 30-00 వైడ్ రోడ్డు, **తూర్పు :** ప్లాట్ నం.95, **పడమర :** ప్లాట్ నం.93.

**బి.రాజశేఖర్ రాజు,** అడ్వకేట్
ఇం.నెం. 12-24, నెహ్రూ కాలనీ, షాద్‌నగర్, రంగారెడ్డి జిల్లా. తెలంగాణ రాష్ట్రం. సెల్: 9849415189

**బహిరంగ ప్రకటన**

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ శ్రీ మక్తల వినయ్ కుమార్ తండ్రి ఎమ్.శ్రీనివాస్ గౌడ్, నివాసం: ఇం.నెం.3-98, పుట్టగూడ, కొడకంచి, మెదక్ జిల్లా వారు రొంపల్లి గ్రామం, బంట్వారం మండలం, వికారాబాద్ జిల్లా వద్ద గల సర్వే నెం.251/A/1/2 లో ఎక.0.37 గుంటలు విస్తీర్ణం, సర్వే నెం.255/1AA/2లో ఎక.2.03 గుంటలు విస్తీర్ణం మరియు సర్వే నెం.255/1AA/1లో ఎక.0.10 గుంటలు విస్తీర్ణం, మొత్తం ఎక.3.10 గుంటలు విస్తీర్ణం భూములు కలిగిన 1) మిడికేరి పద్మమ్మ భర్త ఎమ్.రాములు మరియు 2) గిరి మంజుల భర్త జి.వెంకటేష్, ఇద్దరి నివాసం: రొంపల్లి గ్రామం, బంట్వారం మండలం, వికారాబాద్ జిల్లా వారితో అమ్మకం ఒప్పందం కుదుర్చుకున్నారు మరియు నా క్లయింట్ అమ్మకపు ప్రతిఫలంలో భాగంగా బయానా నిమిత్తం కొంత మొత్తాన్ని చెల్లించాలని ఉద్దేశిస్తున్నారు. అందువల్ల ఎవరేని వ్యక్తి లేదా వ్యక్తులు పైన తెలిపిన సదరు వ్యవసాయ భూములకు సంబంధించి ఏదేని హక్కు, టైటిల్, క్లైయిలు, అటాచ్‌మెంట్స్ లేదా అభ్యంతరాలు కలిగి ఉన్నచో సంబంధిత డాక్యుమెంట్లతో సహా ఈ ప్రచురణ తేదీనుండి 7 రోజులలోగా దిగువ సంతకందారును సంప్రదించవచ్చును, లేనిచో నా క్లయింట్ పైన తెలిపిన వ్యవసాయ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ లాంచనాలతో ముందుకు సాగుతారు, ఆతరువాత పై సదరు ఆస్తులకు సంబంధించి ఏవిధమైన క్లైయిలు లేదా అభ్యంతరాలు అనుమతించబడవు.

**ఎస్.మధుసూధన్ రెడ్డి,** అడ్వకేట్
ఇం.నెం.4-1-326/బి1, శివాజీ నగర్, వికారాబాద్ మున్సిపాలిటీ, వికారాబాద్ జిల్లా–501101, నెం.9550545930